క్లుప్తంగా

వాహనదారులు నిబంధనలు పాటించాలి



మహబూబాబాద్ రూరల్: ప్రతి వాహన దారుడు తప్పనిసరిగా పోలీసు, రవాణా, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రూరల్ సీఐ సర్వయ్య అన్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జమాండ్లపల్లి గ్రామంలో గురువారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. నంబర్ ప్లేట్, హెల్మెట్ లేని వాహనాలను సీజ్ చేసి కౌన్సిలింగ్ ఇచ్చామని తెలిపారు. తనిఖీల్లో కేసముద్రం ఎస్సై మురళీధర్ రాజు, రూరల్ ఎస్సై దీపిక, ఎస్సై కోటేశ్వరరావు పాల్గొన్నారు.

8న మెగా జాబ్ మేళా



మాట్లాడుతున్న సీఐ బాబూరావు

గూడూరు/గంగారం/గార్ల: నిరుద్యోగ యువతీ యువకులకు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా ఈనెల 8వ తేదీన మానుకోటలోని ఏబీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు సీఐ కె.బాబూరావు తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. 40కి పైగా కంపెనీలు, 2000పైగా ఉద్యోగాలు కనీస వేతనం రూ.12వేలకు పైన ఉంటుందన్నారు. మండలాలకు చెందిన నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కనీస విద్యార్హత పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఫార్మసీ కల్గిన వారికి తగిన ఉద్యోగాలు ఉంటాయన్నారు. ఆసక్తి కల్గిన యువతీ యువకులు పేర్లను ఆయా పోలీసుస్టేషన్‌లలో నమోదు చేసుకోవాలన్నారు.

రేపు జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ ఎంపికలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రాంగణంలో ఈనెల 5వ తేదీన మధ్యాహ్నం 3గంటలకు సీనియర్ విభాగంలో బాల, బాలికలకు జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ ముల్లంగి ప్రతాప్‌రెడ్డి గురువారం తెలిపారు. పూర్తి వివరాలకు 99852 33882 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభం

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ ఓపెన్ సొసైటీ ఇంటర్మీడియట్, పదో తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభమైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వి.రాజేశ్వర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను డీఈఓ పరిశీలించారు. ఇంటర్ పరీక్షలకు 68మంది విద్యార్థులకు 44మంది, ఓపెన్ పది పరీక్షలు ప్రభుత్వ బాలుర పాఠశాలలో జరుగుతున్నాయని, 71 మంది విద్యార్థులకు 20 మంది హాజరయ్యారన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

కురవి: గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా అందజేస్తున్న మంచినీటిని తాగునీటిగా వాడుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, తాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని మిషన్ భగీరథ సీఈ లలిత అన్నారు. మండల కేంద్రంలో గ్రామ మంచినీటి సహాయకులకు నాలుగు రోజులపాటు శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. శిక్షణ తీసుకున్న సహాయకులకు గుర్తింపు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఈఈ కృష్ణారెడ్డి, డీఈలు స్వామిదాసు, అనూష, ఏఈ హన్మంతు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

కేసముద్రం: హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని, మహబూబాబాద్ ఎమ్మెల్యే భుక్య మురళీనాయక్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి గురువారం కలిశారు. ఈ మేరకు కొత్తగా ఏర్పాటైన ఇనుగుర్తి మండల కేంద్రానికి ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలను మంజూరు చేసి, నిధులను విడుదల చేయాలని కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

డోర్నకల్: డోర్నకల్ మీదుగా అక్రమంగా తరలిస్తున్న 16క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. డోర్నకల్ ఎస్సై వంశీధర్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి అమ్మపాలెం క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీ నిర్వహిస్తూ బొలేరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఇల్లెందు శివారు సత్యనారాయణపురానికి చెందిన పెండ్ర రామారావు, లింగనబోయిన నరేష్, ఎలియాస్ నాగేశ్వర్‌రావుతో కలిసి గార్ల మండలం బుద్దారంతోపాటు పలు గ్రామాల్లో పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఖమ్మం తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అడ్డగోలుగా పేలుడు పదార్థాలు..

- గుట్టలు, రాళ్లు తొలగించేందుకు వాడకం
- జంతువులు, పక్షులకు ఏర్పడుతున్న ముప్పు
- చోద్యం చూస్తున్న అధికారులు



గాలివారిగూడెం రెవెన్యూ పరిధిలో బండలకు రంధ్రాలు చేస్తున్న కూలీ

మరిపెడ రూరల్: మరిపెడ మండలం పలు ప్రాంతాల్లో భూములు, ప్లాట్లలో ఉన్న గుట్టలు, రాళ్ల తొలగించేందుకు అనుమతి లేకుండా అడ్డగోలు పేలుడు పదార్థాలు (జిలిటెన్ స్టిక్స్) వినియోగిస్తున్నారు. పేలుడు పదార్థాల కారణంగా శబ్దాలతో కూడిన విషవాయువులు వెలువడుతున్నాయి. దీంతో గుట్టల ప్రాంతంలోని జీవరాసులు, పక్షులకు ముప్పు ఏర్పడి అవి అంతరించే పరిస్థితి దాపురించిందని పలువురు చెబుతున్నారు. అయినప్పటికీ నిత్యం ఏదో ప్రాంతంలో పేలుడు పదార్థాలతో గుట్టలు, రాళ్లను తొలుస్తున్నారు. చదును చేసే భూములు, ప్లాట్లలో అడ్డు వచ్చిన రాళ్లను పగలగొట్టేందుకు కంప్రెషర్ ద్వారా బండరాళ్లకు రంధ్రాలను చేస్తున్నారు. ఆ తర్వాత అనుమతులు లేకుండా కొనుగోలు చేసుకున్న పేలుడు పదార్థాలతో పేల్చేస్తున్నారు. నిత్యం ఏదో ఒకచోట యథేచ్ఛగా పేలుడు జరుగుతున్నా సంబంధించిన అధికారులు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికార యంత్రాంగం స్పందించి పేలుడు పదార్థాలపై నిఘా ఏర్పాటు చేసిన నివారణ చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం..



మాట్లాడుతున్న ఎంపీ బలరాంనాయక్

గార్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఆరు గ్యారంటీల పథకాలు కచ్చితంగా అమలు చేస్తుందని ఎంపీ పొరిక బలరాంనాయక్ అన్నారు. గురువారం మండలంలోని తిర్లాపురం గ్రామంలో ఆల్ ఇండియా రాజీవ్‌గాంధీ గ్యార్ బాయ్ మత్రో ఆత్మీయ సమ్మేళనం సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంపీగా గెలిచి తొలిసారి మండలానికి వచ్చిన ఎంపీకి కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో త్వరలో అర్హులందరికీ డిజిటల్ రేషన్ కార్డులు అందజేసేందుకు కొన్ని జిల్లాల్లో, నియోజకవర్గాల్లో పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎమ్మెల్యేలు ప్రారంభించారన్నారు. శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదలకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా గ్యార్‌బాయ్ మత్రో చైర్మన్ జర్పుల లచ్చిరాం నాయక్, టీపీసీసీ సభ్యుడు రావూరి వెంకట్రామయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, సాంబశివరావు, కృష్ణగౌడ్, వెంకట్‌రెడ్డి, వెంకట్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ స్మార్ట్ కార్డుల కోసం సర్వే



సర్వే చేస్తున్న ఆర్డీఓ నర్సింహారావు

దంతాలపల్లి: ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సేవలు అందించేందుకు డిజిటల్ స్మార్ట్ కార్డుల నూతన విధానం తీసుకువచ్చేందుకు సిద్ధం అయింది. అందులోని భాగంగా మండలంలోని రామవరం గ్రామంలో గురువారం తొర్రూరు ఆర్డీఓ నర్సింహారావు సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ స్మార్ట్‌కార్డుల పని తీరును పరిశీలించేందుకు చిన్నగ్రామాలను ఎంచుకున్నట్లు తెలిపారు. అందుకోసం పైలట్ ప్రాజెక్టు కింద డోర్నకల్ నియోజకవర్గంలో రామవరం గ్రామం ఎన్నికైనట్లు ఆర్డీఓ తెలిపారు. కార్డుల పంపిణీకి గ్రామంలోని కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు కార్యక్రమంలో తహసీల్దారు కాటం చంద్ర జగదీశ్వర్, ఆర్ఐ నజీముద్దీన్ పాల్గొన్నారు.

నేడు పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది ఉత్సవాలు



మాట్లాడుతున్న శ్రీశైలం

మహబూబాబాద్ అర్బన్/తొర్రూరు: జిల్లా కేంద్రంలోని గిరిజన భవనంలో ఈనెల 4న నిర్వహించే పీడీఎస్‌యూ అర్ధశతాబ్ద ఉత్సవ సభను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ కార్యాలయం ప్రాంగణంలో గురువారం కమిటీ సమావేశం నిర్వహించారు. విద్యార్థుల పక్షాన పోరాడుతున్న పీడీఎస్‌యూ నేటికి 50 వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. కార్యక్రమంలో కమిటీ కోకన్వీనర్ బలాష్టి రమేష్, జిల్లా కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకన్న, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

‘బీజేపీ పాలనలో అభివృద్ధి శూన్యం’



కురవి: మాట్లాడుతున్న సాదుల శ్రీనివాస్

నెల్లికుదురు/కురవి: బీజేపీ పాలనలో దేశంలో అభివృద్ధి శూన్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. పార్టీశాఖ మహాసభలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల, మత, ప్రాంతీయ ఘర్షణలు సృష్టించి, ప్రాంతీయ పార్టీల ప్రభుత్వాలను కూల్చి అడ్డదారిలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలోమున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సూర్నపు సోమయ్య, కుర్ర మహేష్, బానోత్ సీతారాంనాయక్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. కురవి మండలం బలపాల గ్రామ శాఖ కార్యదర్శిగా పిట్టల వెంకన్నను ఎన్నుకున్నారు.

పోరాటాలు నిర్వహించాలి

గార్ల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ముల్కనూరు గ్రామంలో జరిగిన పార్టీ గ్రామశాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సీపీఎం ముల్కనూరు శాఖ కార్యదర్శిగా జెన్నె రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న వీఓఏలు

మహబూబాబాద్: జిల్లాలోని బయ్యారం మండలంలోని 2017నుంచి పెండింగ్‌లో ఉన్న ఐకేపీ వీఓఏల వేతనాలు వెంటనే చెల్లించాలని లేని ఎడల నిరవధిక సమ్మె చేపడతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అధికారులను హెచ్చరించాడు. సీఐటీయూ అనుబంధ ఐకేపీ వీఓఏల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బయ్యారం మండల వీఓఏలు గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. 17మంది వీఓఏల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని ఒక్కొక్కరికి సుమారు రూ.20వేల నుంచి రూ.45వేల వరకు బకాయిలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు నీలం కృష్ణవేణి, బయ్యారం మండలం అధ్యక్ష, కార్యదర్శి వసంత, కృష్ణకుమారి, శ్రీను, అశ్విని, లలిత, పద్మ, సునీత, సైదాబీ పాల్గొన్నారు.

జల్సాల కోసం ద్విచక్రవాహనాల చోరీ

- దొంగను చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు
- రూ.4.30లక్షల విలువ గల ద్విచక్రవాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ ఎన్.తిరుపతిరావు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

మహబూబాబాద్ రూరల్: జల్సాల కోసం ద్విచక్ర వాహనాలు చోరీ చేసి అమ్ముకుంటున్న ఓ దొంగను మహబూబాబాద్ టౌన్ పోలీసులు చాకచక్యంగా పట్టుకుని, అతడి వద్ద నుంచి రూ.4.30లక్షల విలువగల 10ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ ఎన్.తిరుపతిరావు గురువారం వివరాలు వెల్లడించారు. ఎస్సై బి.విజయ్ కుమార్ సిబ్బందితో పట్టణంతోపాటు సాలార్ తండా శివారులో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ఒక వ్యక్తి ద్విచక్రవాహనంపై కురవి నుంచి వస్తూ పోలీసులను చూసి బండిని రోడ్డు పక్కకు పడవేసి పారిపోతుండగా గమనించిన పోలీసులు అతడిని పట్టుకుని విచారించారు. కురవి మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన ధరావత్ భావ్ సింగ్ అని గుర్తించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సదరు వ్యక్తి కొద్ది నెలల నుంచి మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో, నెహ్రూసెంటర్ ప్రాంతంలో, కురవి వీరభద్ర స్వామి గుడి వద్ద, చుట్టు పక్కల ప్రాంతాల్లో తాళం వేసిన 10ద్విచక్ర వాహనాలను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. వాటిలో 6ద్విచక్ర వాహనాలను తక్కువ ధరకు అమ్ముకోగా అతడి వద్ద 4ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. భావ్ సింగ్ వద్ద నుంచి ద్విచక్రవాహనాలను కొనుగోలు చేసిన 6గురు వ్యక్తులను కూడా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సదరు నిందితుడి భార్య కొన్ని నెలల క్రితం అతడిని వదిలిపెట్టి పోవడంతో దొంగతనాలకు అలవాటు పడి, జల్సాలు చేస్తున్నాడని డీఎస్పీ పేర్కొన్నారు. నిందితుడిని పట్టుకున్న మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై బి.విజయ్ కుమార్, క్రైం సిబ్బంది రమేశ్ చందర్, సుధీర్, రుద్రయ్య, గౌతంను రివార్డులతో అభినందించారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల్లో జగన్మాత దుర్గాదేవి అమ్మవారు 9 రోజుల పాటు భక్తులకు దర్శనమివ్వనున్నారు. భక్తులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు దుర్గాదేవి అమ్మవార్ల విగ్రహాలను భక్తి శ్రద్ధలతో బ్యాండ్ వాయిద్యాల మధ్య పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వారు తమ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వేదికల వద్ద అమ్మవార్లను కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. - సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: జైదుర్గామాత యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు



మహబూబాబాద్ రూరల్: పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చిన భక్తులు



కేసముద్రం: పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గార్ల: దుర్గాదేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



డోర్నకల్ ముత్యాలమ్మతల్లి ఆలయంలో పూజలు



గూడూరు: శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో..



కురవి: దుర్గాదేవి వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

సంక్షిప్త సమాచారం

గడ్డివాము దగ్ధం

గూడూరు: మండల కేంద్రంలోని యాదవనగర్‌లో గురువారం పేరాల కొమురయ్యకు చెందిన 3ఎకరాల గడ్డివాము ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఊరికి కొద్ది దూరంలో రైతు కొమురయ్య గడ్డిని పశువుల మేత కోసం భద్రపరుచుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తి అగ్గిపుల్లను గడ్డి సమీపంలో వేయగా గడ్డివాము అంటుకుంది. వెంటనే అక్కడకు చేరుకున్న ఫైరింజన్ మంటలను ఆర్పింది. దగ్ధమైన గడ్డి విలువ రూ.25వేలు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

పేర్లు నమోదు చేసుకోవాలి

బయ్యారం: త్వరలో జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన ఉపాధ్యాయులు ఓటు హక్కు కోసం పేర్లను నమోదు చేసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.మల్లారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం బయ్యారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మురళీక్రిష్ణ, యాకూబ్ పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి

కురవి: మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీకి విద్యుత్ సౌకర్యం, ఇంటి నంబర్లు కేటాయించాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంపీడీఓ వీరబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గంధసిరి శ్రీనివాస్, కట్ల కృష్ణయ్య, వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

విమర్శలు చేయడం సరికాదు

కేసముద్రం: ఇనుగుర్తి మండలం అభివృద్ధి విషయంలో మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌పై, కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శలు చేయడం సరికాదని బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఇనుగుర్తి మండల కేంద్రంలో జరిగిన విలేఖరుల మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బేతమళ్ల చంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ వెంకన్న, రామ్మూర్తి, శ్రీను, నాగన్న, మంగ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్న తండావాసులు

నెల్లికుదురు: తండాలో మృతి చెందిన ఓ మృతదేహానికి తండావాసులు అంత్యక్రియలు చేసిన సంఘటన ఇనుగుర్తి మండలం పెద్దతండా గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తండాకు చెందిన జర్పుల మల్సూర్ భార్య గతంలో మృతి చెందగా మల్సూర్ అనారోగ్యంతో మృతి చెందాడు. దహన సంస్కారాలు చేసే స్థోమత మృతుడి కూమారుడికి లేకపోవడంతో తండా వాసులు కలిసి దహన సంస్కారాలు చేసి మానవత్వం చాటుకున్నారు.

అడవిపంది మాంసం పట్టివేత

బయ్యారం: మండలంలోని బాలాజీపేటలో అడవి జంతువు మాంసంను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అధికారులు గురువారం పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కట్ల అశోక్ అడవి పంది మాంసంను విక్రయిస్తున్నాడనే సమాచారంతో దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై పూర్తి విచారణ నిర్వహించిన అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

ప్రపంచ కార్మిక సంఘాల వ్యవస్థాపక దినోత్సవం

నెహ్రూసెంటర్: కార్మిక చట్టాల సవరణను ఉపసంహరించుకోవాలని, కార్మికులందరికీ సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్మరికుంట్ల నాగన్న అన్నారు. ప్రపంచ కార్మిక సంఘాల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో గురువారం సంఘం జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రవి, హేమనాయక్, మహేష్, లాలు, చారి, వీరస్వామి, రాజు, మోహన్, విజయ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

డోర్నకల్: దంతాలపల్లి మండలం నిదానాపురంలో ఎమ్మార్పీఎస్ నాయకులపై కులం పేరుతో దూషించి దాడి చేసేందుకు ప్రయత్నించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి ఇరుగు రవి డిమాండ్ చేశారు. డోర్నకల్ జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, వెంకటేష్ లక్ష్మణ్, వినయ్, రమేష్ పాల్గొన్నారు.

దర్గాలో శ్వాస తీసుకున్న సమాధి?

కేసముద్రం: మండల కేంద్రంలోని జమలాపురం దర్గాలో హజ్రత్ ఖాజా హసన్‌బాబా సమాధిపై కప్పిన చాదర్, పూలు కదిలినట్లు కావడంతో, సమాధి శ్వాస తీసుకుందంటూ వచ్చిన వీడియోలు గురువారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జమలాపురం దర్గాలో బుధవారం అర్ధరాత్రి 12గంటల నుంచి ఉదయం 4గంటల వరకు గంధం పండుగ నిర్వహించారు. ఈమేరకు భక్తులు ప్రార్థనలు చేస్తున్న సమయంలో పైకిలేస్తూ పడుతుండటం శ్వాస తీసుకోవడమేనని, పైగా గుండె కొట్టుకున్నట్లుగా శబ్దం కూడా వచ్చినట్లు అక్కడున్న నిర్వాహకులు తెలిపారు. మొత్తానికి ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పాల్గొన్నారు.

సినిమా నిర్మాణానికి సహకరించాలి

గార్ల: తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రాణత్యాగం చేసి అమరుడైన దొడ్డి కొమురయ్య పోరాట చరిత్రను సినిమాగా నిర్మిస్తున్నందున, అన్నివర్గాల ప్రజలు సహకరించాలని చిత్ర దర్శకుడు ఎం.సేనాపతి కోరారు. గురువారం గార్లలో జరిగిన దొడ్డి కొమరయ్య చిత్ర పరిచయ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాసరావు, విశ్వ, సత్రు, వెంకన్న, రాధాకృష్ణ, రామచంద్రు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

నెల్లికుదురు: మనస్తాపం చెందిన ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందాడు. ఈసంఘటన మండలంలోని నైనాల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. నైనాల గ్రామానికి చెందిన ఏర్పుల వెంకటమల్లు (38) గ్రానైట్ లారీ డ్రైవర్‌గా చేస్తున్నట్లు తెలిపారు. డ్యూటీ చేస్తుండగా 4నెలల క్రితం చేతులపై రాళ్లు పడటంతో ఎడమ చేతికి తీవ్రంగా గాయాలై నాలుగు వేళ్లు తీసేశారు. ఈక్రమంలో మనస్తాపం చెంది చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. భార్య ఏర్పుల సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

నేలకూలిన చెట్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



మరిపెడ రూరల్: వీరన్న ఇంటిపై కూలిన వేప చెట్టు

మరిపెడ రూరల్: మండలంలో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులు, వర్షంతో కూడిన ఈదురు గాలులు బలంగా వీచాయి. దీంతో పలు గ్రామాల్లో పెద్దపెద్ద చెట్లు వేర్లతో సహా పెకిలించుకొని నేలకూలాయి. వీరారం, ఉల్లెపల్లి గ్రామాల్లో చెట్లు కూలీ రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. మండలంలోని గుండెపుడి గ్రామంలో వండ్లకొండ వీరన్న, వండ్లకొండ రాకేష్ సోదరుల రేకుల ఇళ్లపై వేప చెట్టు పడడంతో రెండు ఇళ్లు పూర్తిగా ధ్వంసమైయ్యాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగాయి.

నర్సింహులపేట: మండలంలో బుధవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి పంటపొలాలకు నష్టం వాటిల్లింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి ఏపుగా పెరిగిన వరిపొలాలు, పత్తి పంట నెలకొరిగింది.

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహం (అద్దె భవనం)పై చెట్లు విరిగి పడ్డాయి, దసరా సెలవుల నేపథ్యంలో విద్యార్థులు ఇంటికి వెళ్లడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలుపుతున్నారు. ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన కోంపల్లి రామ్మూర్తి ఇల్లు కూలిపోయింది.

పేద ప్రజలకు అండగా..

మరిపెడ రూరల్: పేద ప్రజలకు అండగా.. కమ్యూనిస్టు జెండా ఉంటు వారి హక్కుల కోసం నిరంతరాయంగా పోరాడుతుందని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు అల్వాల వీరయ్య అన్నారు. గురువారం మరిపెడ మండలం తాళ్లఊకల్ గ్రామంలో సీపీఐ(ఎం) గ్రామ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. అనంతరం తాళ్లఊకల్, బుర్హాన్‌పురం గ్రామాలకు సీపీఐ(ఎం) శాఖ కార్యదర్శిగా పుల్లూరి దేవయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.